సాక్షి వనపర్తి

బుధవారం ; 10 ; జనవరి ; 2024



దళారుల 'దగా'..
ఉద్యాన పంటల మార్కెటింగ్ లేక రైతులు దళారుల చేతిలో మోసపోతున్నారు.
వివరాలు 8లో ▸



మైసమ్మ బైలెల్లినాదో..
పర్వతాపూర్ మైసమ్మ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం 111 బోనాలు ఊరేగించారు.
వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
31.6 /18.9

వాతావరణం
ఉదయం, రాత్రి వేళలో చలి తీవ్రత అధికంగా ఉంటుంది. మంచు కురుస్తుంది. అప్పుడప్పుడు చల్లటి గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కంప్యూటరీకరణ వేగవంతం : డీపీఓ



ఆత్మకూర్: ప్రజాపాలన దరఖాస్తుల కంప్యూటీకరణ వేగవంతంగా కొనసాగుతుందని జిల్లా పంచాయతి అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం రాత్రి స్థానిక పుర కార్యాలయంలో కొనసాగుతున్న దరఖాస్తుల కంప్యూటరీకరణను పరిశీలించి మాట్లాడారు. దరఖాస్తుల్లో పొందుపర్చిన అంశాలన్నింటిని తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. ఆయనవెంట తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, పుర కమిషనర్ నాగరాజు ఉన్నారు.

పాఠశాలల తనిఖీ



ఖిల్లాఘనపురం: పాఠశాలల్లో విద్యార్థుల వర్క్‌బుక్ దిద్దడం ఉపాధ్యాయుల బాధ్యతని జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి యుగంధర్ అన్నారు. మంగళవారం రుక్కన్నపల్లి, సోళీపురం, బోడగట్టుతండా, మ ల్కిమియాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలను ఆ యన ఆకస్మికంగా తనిఖీ చేసి ఎఫ్ఎల్ఎన్, ఎఫ్ఆర్ఎస్ హాజరు అమలు తీరును పరిశీలించారు. పాఠ్య ప్రణాళిక, పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్‌లను అలైన్‌మెంట్ చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. తెలుగు, గణితం, ఆంగ్లంలో విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఆందోళనలు



పాన్‌గల్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ దేశవ్యాప్త ఆందోళనలు చేపట్టనున్నట్లు రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి సాగర్ తెలిపారు. మంగళవారం మండలంలోని రేమద్దుల గ్రామంలో నిర్వహించిన రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర విధానాలపై ఈ నెల 10 నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 19వ తేదీన అన్ని జిల్లాకేంద్రాల్లో కార్మిక-కర్షక ఐక్యత సదస్సులు, 26న జిల్లాకేంద్రాల్లో ట్రాక్టర్, వాహనాల ర్యాలీలతో అన్నివర్గాలను చైతన్యం చేయనున్నట్లు వివరించారు. బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి.. కార్పొరేట్ శక్తులను తరిమికొట్టాలి.. దేశాన్ని రక్షించాలనే నినాదంతో కొనసాగుతున్న ఈ ఆందోళనలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలో రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ఎండి జబ్బార్, జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి, రైతు సంఘం సీనియర్ నాయకుడు నాగిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, భాస్కర్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు భగత్, డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు ఆంజనేయులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

హమాలీల సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి



పెబ్బేరు రూరల్: అన్ని తరగతుల హమాలీల సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం వనపర్తి మండలం కడుకుంట్ల శివారులోని తెలంగాణ బేవరేజెస్ గోదాం సమీపంలో హమాలీ సంఘం నాయకులతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హమాలీలకు ప్రమాదబీమా కల్పిస్తూ గుర్తింపు కార్డులు, 60 ఏళ్లు దాటిన వారికి రూ.6 వేల పింఛన్, ఇళ్లు, ఇంటి స్థలాలు, రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే సొంత గోదాం నిర్మించాలని, డిపోలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం డిపోలోని 70 మంది కార్మికులు సీఐటీయూలో చేరగా.. నాయకులు కండువాలు కప్పి ఆహ్వానించారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లయ్య, జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్, వంగూరు రాములు, సుధాకర్, ఎల్లయ్య, కార్మికులు రాజు, ప్రభాకర్, రామకృష్ణ, శ్రీను, రామాంజనేయులుగౌడ్, సాయి పాల్గొన్నారు.

లక్ష్యం.. శతశాతం

'పది' వార్షిక పరీక్షలకు పక్కా ప్రణాళిక



అమరచింత కేజీబీవీలో పరీక్ష రాస్తున్న విద్యార్థినులు (ఫైల్)

- పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు
- సబ్జెక్టుల వారీగా స్లిప్‌టెస్ట్‌ల నిర్వహణ
- వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

అమరచింత: ప్రభుత్వ పాఠశాలల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు అధికారులు, ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. నిత్యం పాఠ్యాంశాల బోధనతో పాటు సబ్జెక్టుల వారీగా స్లిప్‌టెస్టులు నిర్వహిస్తూ చదువులో వెనుకబడ్డ విద్యార్థినులపై దృష్టి సారిస్తున్నారు. గతేడాది కన్నా ఈ విద్యాసంవత్సరం అత్యుత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. రోజు ఉదయం, సాయంత్రం అదనంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ పాఠ్యాంశాలను రివిజన్ చేస్తూ వెనుకబడిన విద్యార్థులకు అర్థంకాని విషయాలను మరోమారు బోధిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 14 మండలాల్లో 6,303 మంది విద్యార్థులు ఈ ఏడాది పది వార్షిక పరీక్షలు రాయనుండగా.. అందులో 4,225 మంది ప్రభుత్వ, 2,078 మంది ప్రైవేటు పాఠశాలల విద్యార్థులున్నారు.

ప్రతినెల పరీక్షలు..

విద్యార్థులకు ప్రతినెల సీపీటీ టెస్ట్‌లు నిర్వహిస్తున్నారు. అలాగే నెలవారీగా అన్ని సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు తయారుచేసి అందించడం, జవాబులు రాయించడం వంటి కార్యక్రమాలు అయిదు నెలలుగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతినెల సీపీటీ పరీక్షలు జరుగుతున్నాయి.

అధికారుల ఆకస్మిక తనిఖీలు..

జిల్లాలో పాఠశాలలు	
ప్రభుత్వ	102
ప్రైవేట్	82
కేజీబీవీలు	15
మోడల్ స్కూల్స్	3
మొత్తం	202

పదో తరగతి విద్యార్థులు	
ప్రభుత్వ	4,225
ప్రైవేట్	2,078
మొత్తం	6,303

పదోతరగతి విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న 'లక్ష్య' కార్యక్రమం ఎలా కొనసాగుతుందో పరిశీలించేందుకు అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. తనిఖీల్లో తమ దృష్టికి వచ్చిన విషయాలను అప్పటికప్పుడే సరి చేస్తూ నాణ్యమైన విద్య అందించాలన్న లక్ష్యంతో జిల్లా అధికారులు ముందుకు సాగుతున్నారు. డీఈఓతో పాటు మండల విద్యాధికారులు వారంలో ఒకమారు పాఠశాలలను సందర్శించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో ఈసారి అనుకున్న ఫలితాలు సాధిస్తామనే ధీమాలో అధికారులు ఉన్నారు.

పరీక్షల భయం వీడేందుకు..

విద్యార్థులు పరీక్షలంటే భయం వీడి హాజరయ్యేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. నిత్యం స్లిప్‌టెస్ట్‌లు నిర్వహించడం, పరీక్షల మాదిరి ప్రశ్నపత్రాలు అందించడం, ఆయా ప్రశ్నలకు సమాధానాలు రాబట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పరీక్షలంటే భయం పోయింది..



గతంలో పరీక్షలంటే ఎంతో భయం కలిగేది. ప్రస్తుతం పాఠశాలలో నిత్యం మోడల్ పేపర్లు చేతికందించడంతో వాటిని చదువుతూ ప్రశ్నలకు జవాబులు రాస్తున్నాం. అంతేగాకుండా ప్రతినెల అన్ని సబ్జెక్టుల పరీక్షలు నిర్వహిస్తుండటంతో పరీక్షలంటే భయం వీడింది. ఈసారి పది వార్షిక పరీక్షల్లో 10 జీపీఏ సాధించడమే లక్ష్యంగా చదువుతున్నా.

– భవిత, పదోతరగతి విద్యార్థిని, అమరచింత

అర్థమయ్యేలా బోధన..



రోజు తరగతి గదిలో ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు అర్థమయ్యేలా బోధిస్తున్నారు. గణితం, ఆంగ్లం, సామాన్యశాస్త్రంపై ప్రత్యేక దృష్టి సారిస్తుండటంతో విషయాలు చక్కగా అర్థమవుతున్నాయి. స్లిప్‌టెస్ట్‌ల నిర్వహణతో సబ్జెక్టుపై పట్టు సాధిస్తున్నాం.

– టి.అనూష, పదోతరగతి విద్యార్థిని, అమరచింత

ఉత్తమ ఫలితాలే లక్ష్యం..



కేజీబీవీలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి 'లక్ష్య' అనే కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేస్తున్నాం. అంతేగాకుండా నిత్యం వెనుకబడిన విద్యార్థినులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. విద్యార్థినులు పరీక్షలంటే భయం వీడేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. జిల్లాలోని 15 కేజీబీవీల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం.

– శుభలక్ష్మి, జీసీడీఓ

ప్రణాళికాబద్ధంగా ముందుకు..



ఈ విద్యాసంవత్సరం పదోతరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలనే సంకల్పంతో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు కొనసాగిస్తున్నాం. చదువులో వెనుకబడ్డ విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు రివిజన్ తరగతులు నిర్వహిస్తున్నారు.

– మహానంది, ఏఎంఓ

వసతుల కల్పనకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి.. చిత్రంలో కలెక్టర్, ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్



నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న కో–ఆప్షన్ సభ్యుడు ఎండి ఉస్మాన్

- జెడ్పీ సమావేశంలో ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి
- ఎప్పటిలాగే కొన్ని శాఖలపైనే చర్చ

వనపర్తి: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ఎంపీడీఓ, ఎంఈఓలు జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలతో కలిసి మండలాల వారీగా వివరాలు సేకరించి నివేదిక అందజేయాలని సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ప్రాధాన్యత క్రమంలో డీఆర్డీఓ, వ్యవసాయం, ఉద్యాన, విద్య, ఆరోగ్యశాఖపై చర్చించారు. ఎప్పటిలాగే మధ్యాహ్న భోజన విరామ సమయం వరకు వివిధ శాఖల పనితీరుపై సభ్యులు చర్చించారు. విరామం అనంతరం కొందరు సమావేశానికి హాజరుకాలేదు. మరికొందరు ఒకటి రెండుశాఖలపై చర్చించారు.

- గ్రామీణాభివృద్ధిశాఖపై చర్చ ప్రారంభంకాగానే సదరం ధ్రువపత్రాల కోసం దివ్యాంగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కో–ఆప్షన్ సభ్యుడు మునీరుద్దీన్, జెడ్పీటీసీ సభ్యులు రాజేంద్రప్రసాద్, కృష్ణయ్య, వెంకట్రామమ్మ తెలిపారు. స్లాట్ బుకింగ్ కోసం గంటల తరబడి మీ–సేవా కేంద్రాల వద్ద వేచి ఉంటే అరగంటలోనే వెబ్‌సైట్ బంద్ అయిందంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని.. ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని కలెక్టర్‌ను కోరారు. వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో చర్చించి సమాధానమిస్తామని వివరించారు.
- కొనుగోలు కేంద్రాల నిర్వహణతో వచ్చే ఆదాయంపై అధికారుల పర్యవేక్షణ ఉండాలని, దశాబ్దకాలంగా డిఫాల్ట్‌గా కొన్ని సంఘాలకు స్త్రీనిధి రుణాలు ఇవ్వటం లేదని శ్రీరంగాపూర్ జెడ్పీటీసీ తెలుపగా.. ఖర్చుల లెక్కలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని డీఆర్డీఓ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మండల, జిల్లా సమాఖ్య సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు.
- ఉద్యానశాఖ నుంచి తుంపర సేద్యం పరికరాలు రాయితీపై ఎప్పుడు ఇస్తారు, కూరగాయల సాగుపై అవగాహన సదస్సులు ఎందుకు నిర్వహించటం లేదని జెడ్పీటీసీ సభ్యులు రాజేంద్రప్రసాద్, కృష్ణయ్య ప్రశ్నించగా.. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ఇస్తామని.. అవసరం ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఉద్యాన అధికారి సురేష్ బదులిచ్చారు. రైతువేదికల్లో రైతులకు ఉద్యాన పంటల సాగుపై అవగాహన కల్పించాలని జెడ్పీ చైర్మన్ సూచించారు.
- కేజీబీవీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని వీపనగండ్ల ఎంపీపీ కమలేశ్వర్‌రావు, జెడ్పీటీసీ సభ్యులు వెంకటరమణమ్మ, సామ్యానాయక్, భీమయ్య, రఘుపతిరెడ్డి కోరారు. వీపనగండ్ల కేజీబీవీ ఇంటర్‌కు అప్‌గ్రేడ్ అయినా ఉపాధ్యాయులను కేటాయించడం లేదని సభ్యులు అధికారిని ప్రశ్నించారు. ఇందుకు విద్యాశాఖ అధికారి బదులిస్తూ.. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని, మరమ్మతులు వెంటనే పూర్తి చేయిస్తామన్నారు. మన ఊరు–మన బడి పనుల విషయంలో నిర్లక్ష్యం అలుముకుందని సభ్యులు ప్రశ్నించగా.. బదులిచ్చే విద్యాశాఖ ఇంజినీరింగ్ అధికారి సమావేశంలో లేకపోవటంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ సంబంధిత అధికారికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని జెడ్పీ సీఈఓను ఆదేశించారు.
- సీహెచ్‌సీల్లో సమస్యలు పరిష్కరించాలని రేవల్లి జెడ్పీటీసీ భూమయ్య, వీపనగండ్ల ఎంపీపీ కమలేశ్వర్‌రావు కోరగా.. ఆ రెండు పీహెచ్‌సీలను సీహెచ్‌సీలుగా అప్‌గ్రేడ్ చేసినా.. వైద్యుల పోస్టులు మంజూరు కాలేదని, త్వరలో వైద్య, ఆరోగ్యశాఖపై సమీక్ష నిర్వహించి ప్రభుత్వానికి మరోమారు ప్రతిపాదనలు పంపిస్తామని, వైద్యులను కేటాయించే ప్రయత్నం చేస్తామని కలెక్టర్ బదులిచ్చారు.

కో–ఆప్షన్ సభ్యుడి నిరసన..

జెడ్పీ చైర్మన్ తన ప్రతిపాదన మేరకు నిధుల కేటాయింపులో వివక్ష చూపుతున్నారంటూ కో–ఆప్షన్ సభ్యుడు ఎండి ఉస్మాన్ సమావేశంలో నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. మదనాపురం మండలం గోపన్‌పేటలో సీసీరోడ్డు, డ్రెయినేజీ నిర్మాణానికి రూ.8 లక్షలు కేటాయించాలని ఎనిమిది నెలలుగా కోరుతున్నా... మిగతా సభ్యులకు కేటాయించి తనకు మాత్రం ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చైర్మన్‌తో మాట్లాడి సమస్య పరిష్కరించుకుందామని.. విరమించాలని పలువురు జెడ్పీటీసీ సభ్యులు కోరటంతో ఆయన శాంతించారు.

మంత్రి జూపల్లి, మక్తల్, దేవరకద్ర ఎమ్మెల్యేల గైర్హాజరు..

జెడ్పీ సమావేశానికి రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు మక్తల్, దేవరకద్ర ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, జి.మధుసూదన్‌రెడ్డి హాజరు కాలేదు. వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి సమావేశంలో కొద్దిసేపు ఉండి వెళ్లిపోయారు.

రుణ లక్ష్యం చేరుకోవాలి..

జిల్లాలో ప్రాధాన్యతారంగాలకు ఇచ్చే రుణాల మంజూరులో నిర్లక్ష్యం వీడి గడువులోగా లక్ష్యం చేరుకోవాలని.. కనీసం 75 శాతం మించాలని కలెక్టర్ తేజస్ పవార్ ఎల్‌డీఎం అమూల్ పవార్‌ను ఆదేశించారు. పంట రుణాలు మంజూరు చేయడంలోనూ బ్యాంకర్లు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో రానున్న ఎస్ఎల్‌బీసీ సమావేశంలో స్పష్టంగా తెలియజేయాలన్నారు. ఎల్‌డీఎంకు తెలుగు రాకపోవటంతో రైతులు, రుణాలు తీసుకునేందుకు వచ్చే ఇతర రంగాల వారు సైతం ఇబ్బందులు పడుతున్నట్లు సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.

హామీలు నెరవేరుస్తాం..

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చేందుకు సిద్ధంగా ఉందని.. అపోహలు వీడాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. ఈ విషయమై సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రివర్గ సమావేశం నిర్వహించి సబ్‌కమిటీని ఏర్పాటు చేసినట్లు వివరించారు. రైతుబంధు, రుణమాఫీ, ఇతర సంక్షేమ పథకాలు ఒక్కొక్కటిగా ప్రజలకు అందిస్తామన్నారు.

భగవంతుడికి భక్తులకు వారధి గురువు

- త్రిదండి దేవనాథ జీయర్ స్వామి

వనపర్తిటౌన్: ధనుర్మాసంలో భక్తులు భగవంతుడిని విశేషంగా ఆరాధించి ధన్యత పొందాలని త్రిదండి దేవనాథ జీయర్ స్వామి ఉద్బోధించారు. ధనుర్మాస పూజల్లో భాగంగా మంగళవారం రాత్రి జిల్లాకేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. పుణ్యప్రదమైన ధనుర్మాసంలో వైష్ణవ భక్తులు పూజలు చేసేందుకు చొరవచూపి జీవితాలను సార్థకం చేసుకోవాలన్నారు. ధనుర్మాసం పూజల విశిష్టత, వైభవం ఎంత చెప్పిన తనివి తీరదని.. భక్తులకు, భగవంతుడికి అనుసంధానంగా గురువు ఉంటారని, గురువు ద్వారానే ముక్తి పొందేందుకు భక్తులకు అవకాశం కలుగుతుందని తెలిపారు. పీఠాధిపతులు, మఠాధిపతులు భగవంతుడికి చేరువ చేసే దైవ ప్రక్రియ మార్గాలను ప్రజల దరికి చేర్చడంలో ముందుంటారని వివరించారు. ప్రతి ఒక్కరు అధ్యాత్మికతను అలవర్చుకొని అందుకు అనుగుణంగా ముందుకు సాగాలని సూచించారు. దైవచింతనలో ఉన్న తృప్తి మరెందులో లేదని తెలిపారు. అనంతరం స్వామి వారికి మంగళహారతి ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అయ్యలూరి రఘునాథం, మేనేజర్ గంగాధర్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న త్రిదండి దేవనాథ జీయర్‌స్వామి

తాగునీటి గండం

- కృష్ణానదిలో గణనీయంగా తగ్గిన నీటిమట్టం
- జనవరిలోనే కనిపిస్తున్న మార్చి నాటి పరిస్థితులు
- ప్రస్తుతం శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో 829 అడుగులే..
- 800 అడుగుల వరకు మాత్రమే తాగునీటికి వాడుకునే అవకాశం
- మిషన్ భగీరథ కోసం అందుబాటులో ఉంచాలని అధికారుల లేఖ



ఎల్లూరు సమీపంలోని మిషన్ భగీరథ పంప్‌హౌజ్

కొల్లాపూర్: గతేడాది ఆశించినస్థాయిలో వర్షాలు కురవకపోవడంతో కృష్ణానదిలో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టాయి. శ్రీశైలం డ్యాంలో బ్యాక్‌వాటర్ క్రమంగా తగ్గుతుండడంతో తాగునీటి అవసరాలపై అధికారులు ముందస్తు చర్యలు ప్రారంభించారు. శ్రీశైలం బ్యాక్‌వాటర్ స్థాయిని ప్రతినిత్యం పర్యవేక్షిస్తున్నారు. మిషన్ భగీరథ స్కీంకు నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానిక అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ పంపించారు. ప్రస్తుతానికి తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేనప్పటికీ వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని అధికార యంత్రాంగం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది.

- మిషన్ భగీరథ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కేఎల్ఐ ప్రాజెక్టుకు అనుసంధానంగా కొల్లాపూర్ మండలం ఎల్లూరులో పంప్‌హౌజ్ నిర్మించారు. ఇక్కడి నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు రంగారెడ్డి జిల్లాలోని 3 నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 84 మండలాల ప్రజలకు తాగునీరు అందించేందుకు పైప్‌లైన్లు, వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేశారు. ఇందుకోసం రూ.5,478 కోట్లు గత ప్రభుత్వం ఖర్చు చేసింది. కేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా ఎల్లూరు రిజర్వాయర్‌లోకి కృష్ణానీటిని ఎత్తిపోసి.. అక్కడే ఫిల్టర్ చేసి ఇతర ప్రాంతాలకు సరఫరా చేసేలా నిర్మాణాలు చేపట్టారు. ఇందుకోసం ఎల్లూరులో రూ.120 కోట్లతో పంప్‌హౌజ్, ఫిల్టర్‌బెడ్స్ నిర్మించారు.

రెండు నెలల కనిష్ఠ స్థాయిలో..


శ్రీశైలం డ్యాంలో బ్యాక్ వాటర్ లెవల్స్ క్రమంగా తగ్గుతున్నాయి. గతేడాది మార్చి నెలలో శ్రీశైలం బ్యాక్‌వాటర్ 830 అడుగుల మేరకు ఉన్నాయి. అయితే ఈ ఏడాది జనవరి ప్రారంభంలోనే ఆ స్థాయికి నీరు చేరుకుంది. అంటే రెండు నెలల కనిష్ఠ స్థాయిలో నీటి లెవెల్స్ ఉన్నాయి. కేఎల్ఐ ద్వారా 800 అడుగుల ఎత్తు వరకు నీటిని పంపింగ్ చేయవచ్చు. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వల ప్రకారం ఏప్రిల్ నెల వరకు తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. 800 అడుగుల దిగువకు నీటినిల్వలు పడిపోతే ప్రభుత్వ అనుమతితో నీటిని ఎత్తిపోయాల్సి ఉంటుంది. నిల్వలు భారీగా తగ్గితే మాత్రం రివర్స్ పంపింగ్ ద్వారా నీటిని ఎత్తిపోయాలి.

గతంలో ఇలా...

2018లో ఫిబ్రవరిలోనే కృష్ణానది నీటిమట్టం తగ్గిపోయింది. ఏప్రిల్‌లో మిషన్ భగీరథకు నీళ్లు అందే పరిస్థితులు లేకపోవడంతో రూ.6 కోట్లతో కృష్ణానది లోతట్టు నుంచి నీటిని ఎత్తిపోసేలా కేఎల్ఐ పంప్‌హౌజ్ నుంచి 2.5 కి.మీ., దూరంలోని కోతిగుండు వద్ద కృష్ణా బ్యాక్‌వాటర్‌లో అడ్డుకట్ట నిర్మించారు. అక్కడి నుంచి కేఎల్ఐ అప్రోచ్ ఛానల్‌లోకి నీటిని ఎత్తిపోసేందుకు 100 హెచ్‌పీ సామర్థ్యం గల 25 మోటార్లు, ఇందుకు అవసరమైన విద్యుత్ లైనింగ్ ఏర్పాటు చేశారు. అయితే మోటార్లు బిగించేలోపే కృష్ణానదికి వరదలు రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. మళ్లీ రెండేళ్ల క్రితం కూడా తాగునీటి సమస్య ఎదురవడంతో శ్రీశైలం డ్యాం నుంచి రివర్స్ పంపింగ్ చేయడంతో.. కేఎల్ఐ ద్వారా నీటి పంపింగ్ చేపట్టి తాగునీటి సమస్య లేకుండా చూశారు. అయితే పాలమూరు ప్రాజెక్టు పూర్తిస్థాయిలో వినియోగంలోకి వస్తేనే తాగునీటి సమస్యకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడనుంది.

పాలమూరు ప్రాజెక్టు కోసం..

మిషన్ భగీరథ పథకానికి నీరు అందించే ఎల్లూరు రిజర్వాయర్‌లో నీటినిల్వ సామర్థ్యం కేవలం 0.36 టీఎంసీలు మాత్రమే. దీని ద్వారా ప్రతిరోజూ 0.02 టీఎంసీ నీటిని తాగునీటికి సరఫరా చేస్తున్నారు. ఎల్లూరు రిజర్వాయర్‌లో అధికంగా నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడంతో పాలమూరు ప్రాజెక్టుకు మిషన్ భగీరథను అనుసంధానం చేసేందుకు చర్యలు చేపట్టారు. పాలమూరు ప్రాజెక్టులో భాగమైన నార్లాపూర్ రిజర్వాయర్‌లో 2 టీఎంసీల మేరకు నీటిని నిల్వ చేశారు. వేసవిలో ఆ నీటిని మిషన్ భగీరథకు మళ్లించేందుకు నీటి పారుదల అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో రిజర్వాయర్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నుంచి మిషన్ భగీరథకు మళ్లించేందుకు కాల్వలు, పైపులైన్ ఏర్పాటుకు ఉపక్రమించారు.



ప్రస్తుతానికి ఇబ్బంది లేదు..



ప్రస్తుతం తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేదు. శ్రీశైలంలో 830 అడుగుల మేర నీరుంది. మిషన్ భగీరథ కోసం 800 అడుగుల వరకు వాడుకోవచ్చు. ఈ విషయాన్ని మిషన్ భగీరథ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఏదేమైనా తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతాం. రెగ్యులర్‌గా బ్యాక్ వాటర్ లెవెల్స్, నీటి సరఫరా అంశాలను ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నాం.

– అంజాద్‌పాషా, డీఈఈ, మిషన్ భగీరథ

తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాలని..

శ్రీశైలం ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గడంపై కృష్ణా రివర్ బోర్డు మేనేజ్‌మెంట్ కేంద్ర జలవనరుల శాఖకు నివేదిక ఇచ్చింది. పదేళ్లలో నమోదైన నీటినిల్వల సరాసరితో పోలిస్తే ఈసారి 48 శాతం తక్కువ ఉన్నట్లు పేర్కొన్నారు. దీంతో సాగునీరు, విద్యుదుత్పత్తి కంటే తాగునీటి అవసరాలకు నీటిని వినియోగించుకునేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర జల సంఘం ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. స్థానిక అధికారుల లేఖలు, కేంద్ర జలసంఘం సూచనల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సైతం తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని భావిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

కందూరు శివారులో చిరుత సంచారం

అడ్డాకుల: మండలంలోని కందూరు శివారులో మంగళవారం సాయంత్రం వ్యవసాయ పొలాల వద్ద చిరుత పులి కనిపించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామానికి చెందిన గొల్ల చెన్నయ్య సుంకరామయ్యపల్లికి వెళ్లే దారిలో కాముని బండ సమీపంలో మరో రైతు పొలాన్ని కౌలుకు తీసుకుని వేరుశనగ పంట సాగు చేశాడు. సాయంత్రం పొలం వద్దకు వెళ్లిన చెన్నయ్యకు పొలం సమీపంలో చిరుత పులి కనిపించింది. దీంతో భయపడిన రైతు చుట్టు పక్కల ఉన్న రైతులను పిలిచి దాన్ని వెళ్లగొట్టేందుకు యత్నించినా వెళ్లలేదు. తర్వాత రైతులంతా ఊళ్లోకి వెళ్లి సర్పంచ్ శ్రీకాంత్‌కు చెప్పడంతో ఆయన జిల్లా అటవీశాఖ అధికారులకు సమాచారం చేరవేశారు. పొలాల్లో తిరుగుతున్న చిరుతను బంధించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అయితే చీకటి కావడంతో బుధవారం ఉదయం వచ్చి పరిశీలిస్తామని అటవీశాఖ అధికారులు చెప్పినట్లు సర్పంచ్ తెలిపారు. కాగా యాసంగిలో వేరుశనగ పంట సాగు చేసిన రైతులు రాత్రిపూట అడవి పందుల కాపలాకు వెళ్లడానికి భయపడుతున్నారు.

వలలో 15 అడుగుల కొండచిలువ



కొల్లాపూర్: కొల్లాపూర్ పట్టణంలోని శివాలయం సమీపంలో మల్లపురాజు కుంటచెరువులో చేపల వలలో చిక్కుకొని 15అడుగుల కొండ చిలువ మృతి చెందింది. చేపల వేట కోసం చెరువులో వదిలిన వలలను మంగళవారం ఉదయం తీశారు. వలలో కొండచిలువ చిక్కుకోవడాన్ని గుర్తించి మత్స్యకారుడు శివ దాన్ని భయటకు తీశాడు. వలలో చిక్కుకున్న కొండ చిలువ మృతిచెందింది. కొండచిలువ 40కిలోల బరువు ఉన్నట్లు మత్స్యకారులు తెలిపారు.

హైనా దాడిలో ఆవు మృతి

మాగనూర్: మండలంలోని కొత్తపల్లిలో హైనా దాడిలో ఆవు మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఫారెస్టు అధికారి నీలేష్ వివరాల ప్రకారం.. కొత్తపల్లికి చెందిన కర్మిని వెంకటప్ప రోజు మాదిరిగా తన పొలం దగ్గర సోమవారం రాత్రి ఆవును కట్టేసి వచ్చాడు. మంగళవారం ఉదయం వెళ్లి చూడగా ఆవు కనిపించలేదు. దీంతో పక్కనే ఉన్న గుట్ట దగ్గరకు వెళ్లి చూడగా అక్కడ గుర్తు తెలియని జంతువు దాడి చేసి చంపినట్లు గుర్తించాడు. ముందు అది పులి దాడి చేసి చంపినట్లు భావించారు. గ్రామ సర్పంచ్ తిమ్మప్ప సహాయంతో ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వగా సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అది పులి కాదని హైనా అయి ఉంటుందని గ్రామస్తులకు తెలిపారు. చనిపోయిన ఆవును పోస్టుమార్టానికి తరలించారు.

చిరుత దాడిలో లేగదూడ..

మరికల్: మండలంలోని అప్పంపల్లిలో చిరుత దాడిలో లేగదూడ మృతి చెందింది. తీలేటి రాంరెడ్డి తన పశువులను సోమవారం రాత్రి వ్యవసాయ పొలంలోని గుడిసెలో కట్టేసి ఇంటికొచ్చాడు. మంగళవారం ఉదయం పొలానికి వెళ్లి చూడగా.. లేగదూడ అడవి జంతువుల దాడిలో మృతిచెంది ఉంది. విషయాన్ని వెంటనే అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. ఘటన స్థలానికి వచ్చిన అటవీ శాఖ అధికారులు చిరుత దాడి చేయడంతోనే దూడ మృతిచెందిన్నట్లు గుర్తించారు. ఈ ఘటనపై వారు పంచనామా నిర్వహించారు. వ్యవసాయ పొలాల వద్ద రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ఇంట్లో చోరీ



అమరచింత: పండుగ కోసం సరుకులను తీసుకొద్దామని తాళం వేసి వెళ్లిన ఇంట్లో చోరీ చేసి రెండుతులాల బంగారం, రూ.40వేల నగదు తీసుకెళ్లిన ఘటన మంగళవారం నందిమళ్లలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. నందిమళ్ల గ్రామానికి చెందిన రాజవర్ధన్‌రెడ్డి మంగళవారం మధ్యాహ్నం సంక్రాంతి పండుగ కోసం సరుకులు తేవడానికి ఇంటికి తాళం వేసి ఆత్మకూర్ వెళ్లారు. సరుకులతో ఇంటికి తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళం బద్ధలు కొట్టి ఉంది. తలుపులు తెరచి చూడగా బీరువా తాళం పగుల గొట్టి తెరిచి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందజేశాడు. ఎస్‌ఐ జగన్మోహన్ సంఘటనా స్థలానికి చేరుకొని ఇంట్లో పరిశీలించారు. బీరువాలో జత బంగారు చెవికమ్మలు, మాటీలు, ఒక గోల్డ్ చైన్, లాకెట్ కలిపి మొత్తంగా రెండు తులాల బంగారు నగలు చోరీకి గురైనట్లు తెలిపారు. వాటితో పాటు రూ.40వేల నగదు తీసుకెళ్లినట్లు బాధితుడు పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దళారుల ‘దగా’..



మార్కెట్‌కు తరలించేందకు లోడు చేస్తున్న బత్తాయి కాయలు

- మార్కెటింగ్‌కు ఇబ్బందులు
- ప్రోత్సాహం కరువు..
- గణనీయంగా తగ్గిన సాగు
- నష్టపోతున్న బత్తాయి రైతులు

గండేడ్: సాంప్రదాయ పంటలతో విసిగి పోయిన రైతులకు ఉద్యాన పంటల సాగు ఊతమిస్తుందని భావించిన రైతులకు చుక్కెదురవుతోంది. రైతులకు అనుగుణంగా ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో నష్టాలు చూడాల్సి వస్తోంది. ఉద్యాన సాగు దళారుల భోజ్యంగా మారింది. మార్కెటింగ్ సౌకర్యం లేక అహర్నిషలు శ్రమించిన రైతులు దళారుల చేతిలో దగా పడాల్సి వస్తోంది. రేయింబవళ్లు కష్టపడినా రైతు నట్టేటా మునగాల్సి వస్తోంది. పండ్ల తోటల రైతుల కష్టాలు పెరగడంతో గణనీయంగా సాగు పడిపోయింది. ఒకప్పుడు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో బత్తాయి సాగులో గండేడ్ మండలం అగ్రగామిగా నిలిచింది. మిగతా మండలాల రైతులకు ఆదర్శంగా నిలిచిన ఈ మండలంలో వివిధ కారణాలతో బత్తాయి సాగు తగ్గుముఖం పట్టింది. జిల్లాలో 3,345 మంది రైతులు 10వేల 997 ఎకరాల్లో బత్తాయి సాగు కాగా, దాంట్లో గండేడ్ మండలంలో 293 ఎకరాల్లో 153 మంది రైతులు సాగు చేస్తున్నారు. ఒకప్పుడు గండేడ్ మండలంలోనే 9వేల ఎకరాలకు పైగా సాగయ్యేది. ఇప్పుడు ఆ విస్తీర్ణం వివిధ కారణాలతో వందల సంఖ్యకు తగ్గింది.

దళారీదే రాజ్యం...

బత్తాయి సాగులో ఆశించిన లాభాలున్నా దళారుల కారణంగా దగా పడుతున్నారు. మార్కెటింగ్ సౌకర్యం లేక రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. అన్నింట్లోనూ దళారులు రాజ్యమేలుతున్నారు. వారి జోక్యం లేనిదే ఒక్క పండు కూడా అమ్ముకోలేని పరిస్థితి. గండేడ్, మహమ్మదాబాద్ మండలాల్లో ఎక్కడ కూడా మార్కెటింగ్ సౌకర్యం లేదు. జిల్లా కేంద్రంలో కూడా లేకపోవడంతో బత్తాయి రైతుకు దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. మంచి ధర పలికినప్పుడైనా అమ్ముదామనుకుంటే కోల్డ్ స్టోరేజీ సౌకర్యం బత్తాయి రైతుకు అందుబాటులో లేదు. బత్తాయి పండ్లను హైదరాబాద్ కొత్తపేట్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. దళారులు సంవత్సరాల తరబడి లీజుకు తీసుకుని రైతుకు ఎంతో కొంత చెల్లిస్తున్నారు. పండిన దిగుబడిని మార్కెట్లో అమ్ముకొని రైతులకు ఎంతో కొంత ముట్టజెప్పుతున్నారు. లీజుకు తీసుకున్న దళారులు దిగుబడి అధికంగా రావడానికి రసాయనాలు వాడుతున్నారు. దీనివల్ల మొక్కల జీవిత కాలం తగ్గిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బత్తాయి నాలుగో సంవత్సరం నుంచి కాపు మొదలవుతుంది. ఎకరాకు పది టన్నుల వరకు వస్తుంది. రూ.రెండు లక్షల పెట్టుబడి పెడితే నాలుగు లక్షల రూపాయల లాభం ఉంటుంది. కానీ దళారుల ప్రమేయం కారణంగా 8నుంచి 10 శాతం కమిషన్ చెల్లించాల్సి వస్తోంది. దీంతో పాటు రవాణా చార్జీలు అదనంగా చెల్లించుకుంటున్నారు. మార్కెట్లో నేరుగా అమ్ముకొనే పరిస్థితి లేదు. దళారులను ఆశ్రయించకతప్పడం లేదు. పండ్ల తోటల సాగుకు రాయితీలు లేకపోవడంతో రైతులకు పాట్లు తప్పడం లేదు.



రాసి పోసిన బత్తాయి కాయలు

తగ్గిన సాగు విస్తీర్ణం..

గండేడ్ మండలంలోని ఆయా గ్రామాల్లో బత్తాయి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. ఎకరన్నరతో మొదలైన బత్తాయి సాగు నేడు వేల ఎకరాలకు చేరింది. ఉమ్మడి గండేడ్ మండలంలో 9వేల ఎకరాలకు పైగా బత్తాయి సాగైంది. బత్తాయి సాగుకు గండేడ్ మండలం మారుపేరుగా నిలిచింది. ఇప్పుడు ఒక్క గండేడ్ మండలం 293.14 ఎకరాలకు తగ్గింది. అప్పట్లో లాభాలు ఉండటంతో పక్క ప్రాంతాల రైతులు ఈ సాగుపై దృష్టి సారించారు. జానంపల్లిని ఆదర్శంగా తీసుకొని మిగతా గ్రామాల్లోని బత్తాయి సాగు ఎంచుకున్నారు. మండలంలోని రంగారెడ్డిపల్లి, కప్లాపూర్, రెడ్డిపల్లి, సల్కర్‌పేట్, కొండారెడ్డిపల్లి, జక్లపల్లి, లింగాయిపల్లి తదితర గ్రామాల్లో మహమ్మదాబాద్ మండలంలోని నంచర్ల, మొకర్లాబాద్, గాదిర్యాల్ తదితర గ్రామాల్లోనూ బత్తాయి సాగు చేశారు. నీటి వసతితో పాటు సంప్రదాయ పంటల సాగులో ఉన్న ఆటంకాలు, ప్రతికూల పరిస్థితుల కారణంగా బత్తాయి సాగుపైనే రైతులు మక్కువ చూపారు. తెగుళ్లు, మార్కెట్ వసతి, దళారుల రాజ్యమేలడంతో తగ్గుముఖం పట్టింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కోల్డ్ స్టోరేజీలతో పాటు స్థానిక మార్కెటింగ్ సౌకర్యంతో పాటు రాయితీలు కల్పించి ప్రోత్సాహకం అందించాలని రైతులు కోరుతున్నారు.

తెగుళ్లతో తంటాలు..

బత్తాయిలో తెగుళ్ల బెడద కూడా ఎక్కువే. మొక్కలు నాటినప్పటి నుంచి దిగుబడి వచ్చే ప్రతి ఏటా తెగుళ్ల బెడద పెరుగుతూనే ఉంది. ఆకుముడత, గజ్జి, మంగునల్లి, వేరుకుళ్లు తెగులు సోకుతున్నాయి. ఎక్కువగా వేరుకుళ్లు తెగుళ్లతో తోటలు పూర్తిగా నాశనమయ్యాయి. సంవత్సరాల తరబడి ఉన్న తోటలన్నీ ఈ తెగుళ్లతో నరికేయాల్సి వచ్చింది. సీడ్‌లో నాసిరకం తెగుళ్ల వ్యాప్తికి కారణమయ్యాయి. బత్తాయిలో రెండు రకాల సీడ్లు ఉన్నాయి. ఒకటి జంబేరి రెండోది రంగాపూర్. రంగాపూర్ అంటూ అన్నింటిని తట్టుకోవడంతో పాటు అధిక దిగుబడులు వస్తాయి. దీంట్లో కూడా దళారులు ప్రమేయం ఉండి నాసిరకం మొక్కలు ఇస్తుండడంతో రైతులు అన్ని రకాలుగా నష్టపోతున్నారు.

నిలువునా మోసం చేస్తున్నారు..



రేయింబవళ్లు కష్టపడితే అమ్ముకోవడానికి వెళితే నిలువునా మోసం చేస్తున్నారు. దళారీ ద్వారానే మార్కెట్‌కు వెళ్లాల్సి వస్తోంది. 4 శాతం కమీషన్‌కు బదులు 10 శాతం కమీషన్ తీసుకొని దోచుకుంటున్నారు. తూకాల్లోనూ 10–20 కిలోలు మోసం చేస్తున్నారు. లేదంటే అమ్ముకోలేకపోతున్నాం. క్వాలిటీ బాగలేదని, సైజు తక్కువగా ఉంది వేధిస్తున్నారు. ఈసారి నాలుగు ఎకరాలు రూ.5 లక్షలకు లోకల్ వ్యాపారికి ఇచ్చాను. నష్టం అయినా తప్పడం లేదు.

– బోయిని హన్మంతు, రైతు, జానంపల్లి

తెగుళ్లతో తట్టుకోలేకపోయాం..



ఇరవై ఏళ్ల క్రితం ఎకరాల్లో బత్తాయి నాటాం. ప్రతి పంట మంచి దిగుబడి వచ్చింది. అనుకున్న దానికంటే మంచి లాభాలు వచ్చాయి. ఎకరాకు రెండు లక్షల రూపాయల వరకు లాభాలు వచ్చాయి. పదేళ్ల వరకు ఎలాంటి నష్టాలు రాలేదు. తర్వాత మెల్లగా మంగు వచ్చి గ్రేడ్ తగ్గింది. దీంతో రకరకాల వైరస్‌లు సోకాయి. దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. వేరుకుళ్లు తెగులు రావడంతో మొక్కలు ఎండసాగాయి. చేసేది లేక ఇరవై సంవత్సరాల తోటను నరికేశాను. ఇప్పుడు సాధారణ పంటలు సాగు చేస్తున్నాను.

– రవీందర్‌రెడ్డి, రైతు, వెన్నాచేడ్

కోస్గి ఠాణా.. రాజీలకు అడ్డా

- పంచాయితీలను పరిష్కరించడం.. దండుకోవడమే లక్ష్యం
- యథేచ్ఛగా ఇసుక, కలప, బియ్యం అక్రమ దందాలు
- నిద్రావస్థలో నిఘా వ్యవస్థ



ఇసుక అక్రమంగా తరలిస్తున్న టిప్పర్ (ఫైల్)

కోస్గి: పుర పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలికను ఈ నెల 3న ఓ యువకుడు ఎత్తుకెళ్లాడు. బాధితురాలి తల్లి అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సదరు యువకుడు పెళ్లి చేసుకున్నట్లు ఫొటోలు సైతం పంపించాడు. బాలిక తల్లి వారం పాటు పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరిగినా.. కేసు నమోదు చేశాం.. పట్టుకొస్తామంటూ కాలయాపన చేయడమే తప్పా తీసుకురాలేదు.

▪ నాలుగు రోజుల కిందట గుండుమాల్ నుంచి కలప అక్రమంగా తరలిస్తున్న వాహనం నుంచి ఒక దుంగ అదుపుతప్పి బైక్‌పై వెళ్తున్న భక్తిమళ్లకు చెందిన ఓ యువకుడిపై పడటంతో గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఎలాంటి కేసు నమోదు చేయకుండా రూ.25 వేలకు రాజీ కుదుర్చారు.

▪ దౌల్తాబాద్ మండలానికి చెందిన ఓ నాయకుడి కారు ఢీకొని పోతిరెడ్డిపల్లికి చెందిన వృద్ధుడు ఇస్వయ్య మృతి చెందాడు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే రాజీ చేసుకోవాలని సూచించారని.. తప్పనిసరి పరిస్థితుల్లో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టినట్లు కేసు నమోదు చేశారని ఇస్వయ్య కుమారుడు బాలకిష్టయ్య తెలిపారు.

..ఇవి కోస్గి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న కొన్ని ఘటనలు మాత్రమే. కేసు ఎలాంటిదైనా రాజీ కుదుర్చుకోవాలని సూచించడం.. అవసరమైతే బెదిరిస్తున్నారన్న విమర్శలున్నాయి. రేషన్ బియ్యం, కలప అక్రమ రవాణా జోరుగా సాగుతున్నా, ఇసుక దందా కొనసాగుతున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న వాదనలు ఉన్నాయి. అక్రమ వ్యాపారం ఏదైనా పోలీసుల కనుసన్నల్లోనే కొనసాగుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు..



ఈ నెల 3న జరిగిన బాలిక అదృశ్యం ఉదంతంపై తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాం. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా యువకుడి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నాం. ఠాణా పరిధిలో అక్రమ ఇసుక రవాణా జరగడం లేదు. అక్రమ దందాలపై సమాచారం ఇస్తే కేసులు నమోదు చేస్తాం.

– శ్రీనివాసులు, ఎస్‌ఐ, కోస్గి

అక్రమ వసూళ్లకు ప్రత్యేక సిబ్బంది..

అక్రమ దందాలు చేసే వారి నుంచి డబ్బులు వసూలు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌లోనే సుదీర్ఘ కాలంగా విధులు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్‌ను కేటాయించి గుట్టుచప్పుడు కాకుండా వ్యవహారం నడుపుతున్నారని తెలుస్తోంది. పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగే రాజకీయ, సామాజిక అంశాలతో పాటు పోలీసుల పనితీరు, ఇతర అన్ని వ్యవహారాలపై ఆరాతీసి ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడానికి ప్రత్యేకంగా ఉన్న నిఘా వ్యవస్థ నిద్రావస్థలో ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏదేమైనా పంచాయితీలకు అడ్డాగా ఉన్న ఈ ఠాణాపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

సఫాయిల సంక్షేమానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న జాతీయ కమిషనర్‌న్ సఫాయి కర్మచారి సభ్యుడు డాక్టర్ పీపీ వావా

నాగర్‌కర్నూల్: జిల్లాలో సఫాయి కర్మికులకు అమలు చేస్తున్న కార్యక్రమాలపై సఫాయి కర్మచారి జాతీయ కమిషన్‌సభ్యుడు డాక్టర్ పీపీ వావా సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి మంగళవారం నాగర్‌కర్నూల్ బాబు జగ్జీవన్‌రామ్ భవనంలో అధికారులు, సఫాయి కర్మచారులు, ప్రతినిధులతో జాతీయ కమిషన్ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీపీ వావా మాట్లాడుతూ సమాజం ఆరోగ్యంగా ఉండాలని కష్టపడే సఫాయి కర్మచారులకు ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక సాయం, బ్యాంకు రుణాలు అందించాలని సూచించారు. ప్రతి మూడు నెలలకోసారి వైద్య శిబిరం నిర్వహించి వారికి వైద్య సేవలందించాలన్నారు. పరిసరాలను శుభ్రపరిచే కార్మికులపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సఫాయి కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సఫాయి కర్మచారీస్ కోసం కేంద్ర ప్రభుత్వం ఎలాంటి సెక్యూరిటీ లేకుండా బ్యాంకుల ద్వారా నేరుగా రూ.15 నుంచి 40 లక్షల వరకు రుణ సదుపాయం అందిస్తోందని, మెరుగైన జీవనోపాధి శిక్షణ తరగతుల కోసం నెలకు రూ.1500లు ఎనిమిది మాసాల పాటు అందిస్తుందన్నారు. కార్మికులకు మూడు జతల యూనిఫామ్స్ ఇవ్వాలని, ప్రతి మూడు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయాలని సూచించారు. కార్మికుల కోసం ప్రత్యేకంగా ఐడెంటి కార్డులను రూపొందించి అందులో పీఎఫ్, జీతం, బ్లడ్ గ్రూప్ తదితర పూర్తి కార్మికుల సమగ్ర సమాచారం ఉండేలా చూడాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం అందించే పథకాలను కార్మికులకు వివరించి చైతన్య పరచాలన్నారు. అర్హులైన కార్మికులందరికీ రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల అదనం కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో సఫాయి కార్మికుల సంక్షేమానికి అన్ని శాఖల అధికారులు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు జాతీయ కమిషన్ సభ్యులకు అదనపు కలెక్టర్ పూల బొకేతో స్వాగతం పలికి, అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. పలువురు సఫాయి కార్మికులు సమస్యలను కమిషన్ సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. కార్మికుల సమస్యలను అధికారుల పరిష్కరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రామ్ లాల్, డీఎంహెచ్‌ఓ సుధాకర్ లాల్, ఎల్‌ఐఎం కౌన్సిల్ కిషోర్ పాండే, బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీధర్ జీ, డీఆర్డీఏ అదనపు పీడీ రాజేశ్వరి, నాగర్ కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి, అచ్చంపేట మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

50 గ్రాముల గంజాయి స్వాధీనం



జిల్లా కేంద్రంలో నిందితుల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

నాగర్‌కర్నూల్ క్రైం: పోలీసుల తనిఖీలో అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తుల నుంచి 50 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేందర్ సమాచారం మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అనూజ్‌కుమార్, సంజయ్‌వర్మ అచ్చంపేటలో ఐస్‌క్రీం వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం ఉదయం జిల్లా కేంద్రంలో పోలీసులు తనిఖీ చేస్తుండగా వారు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని విచారించగా వారి వద్ద గంజాయి ప్యాకెట్లు ఉండడంతో స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మహబూబ్‌నగర్‌కు చెందిన మహ్మద్ హాజీ జడ్చర్ల పట్టణంలో చికెన్‌సెంటర్ నిర్వహిస్తున్నాడని, అతని వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు వారు ఒప్పుకున్నారు. పోలీసులు జడ్చర్ల పట్టణానికి వెళ్లి మహ్మద్ హాజీని అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతన్ని నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ముగ్గురు నిందితుల నుంచి 50 గ్రాముల గంజాయితో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అంతర పంటలతో అధిక లాభాలు



క్షేత్ర ప్రదర్శనలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు

జడ్చర్ల: ఆయిల్‌పాం తోటల్లో అంతర పంటలు సాగుచేసి అధిక లాభాలు పొందాలని భారతీయ నూనెగింజల పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డా. లావణ్య, డా. సురేష్ కోరారు. మంగళవారం మండలంలోని గంగాపూర్ శివారులో రాఘవరావు సాగు చేసిన ఆయిల్‌పాం తోటను పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం, ఆముదం విభాగం శాస్త్రవేత్తలు సందర్శించి రైతులకు అవగాహన కల్పించారు. యాసంగి సీజన్‌లో ఆయిల్‌పాం తోటలో ఆముదం సాగు చేపడితే ఖర్చు తక్కువ కావడంతో పాటు అధిక దిగుబడులు పొంది లాభాలను అర్జించవచ్చని, రైతులు ఆ దిశగా ఆలోచించాలని వివరించారు. ఇందుకు సంకరజాతి విత్తనాలు ఎంపిక చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ కేంద్రం సహ సంచాలకుడు మల్లారెడ్డి, ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ హరిభూషణ్, ఆముదం విభాగం శాస్త్రవేత్తలు నళిని, సదయ్య, ఈశ్వర్‌రెడ్డి, దివ్యారాణి, మండల వ్యవసాయ అధికారి గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

- భర్త, అత్తామామలపై కేసు నమోదు

బల్మూర్: అదనపు కట్నం తేవాలని భార్యను వేధించడంతో భర్తతో పాటు అత్తమామలపై బాధితురాలు ఫిర్యాదు చేసిన ఘటన మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. మండలంలోని సీతారాంపూర్‌కు చెందిన అంజలికి ఉప్పునుంతల మండలం తాడూర్‌కు చెందిన కృష్ణతో రెండున్నరేళ్ల క్రితం వివాహం అయ్యింది. పెళ్లి సమయంలో ఒప్పుకున్న కట్నకానుకలు ఇచ్చారు. ఇంకా అదనంగా కట్నం తేవాలని అంజలిని భర్త, అత్తమామలు ఆరు నెలలుగా వేధింపులకు గురిచేస్తూ పుట్టింటికి పంపించారు. దీంతో ఆమె తరపు బంధువులు పంచాయితీ పెట్టినా ప్రయోజనం లేకపోయింది. దీంతో బాధితురాలు ఫిర్యాదు చేయడంతో భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం



ఆకాష్ (ఫైల్)



శ్రీనునాయక్ (ఫైల్)

కొత్తకోట రూరల్: ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఓ యువకుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందిన ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట సమీపంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ మంజునాథరెడ్డి కథనం ప్రకారం.. మదనాపురం మండలంలోని రామన్‌పాడ్‌కు చెందిన ముడావత్ శ్రీనునాయక్(31) సెంట్రింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పనిలో భాగంగా ప్రతిరోజు గ్రామం నుంచి బైక్‌పై కొత్తకోటకు వచ్చి.. అక్కడి నుంచి మహబూబ్‌నగర్‌లో పనిచేసి తిరిగి కొత్తకోటకు వచ్చి బైక్ తీసుకుని ఇంటికి చేరుకునేవాడు. ఈ క్రమంలో సోమవారం పని ముగించుకుని రాత్రి 11 గంటల సమయంలో కొత్తకోట నుంచి బైక్‌పై గ్రామానికి వెళ్తుండగా కొత్తకోట సమీపంలో ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వనపర్తి మార్చురీకి తరలించారు. ఈ విషయమై శ్రీనునాయక్ భార్య కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. శ్రీనునాయక్‌కు భార్యతో పాటు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

డీసీఎం ఢీకొని తపాలా ఉద్యోగి..

ధన్వాడ: మండలంలోని మందిపల్లికి చెందిన ఆకాష్ (21) మంగళవారం ఉదయం కోయిల్‌కొండ మండలంలోని రాంపూర్ గేట్ సమీపంలో బైకుపై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన డీసీఎం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మందిపల్లికి చెందిన తిమ్మయ్య కుమారుడు ఆకాష్ దామరగిద్ద మండలంలోని నర్సాపూర్‌లో గ్రామ పోస్టు ఉద్యోగిగా (బీపీఎం) పనిచేస్తున్నాడు. ఉద్యోగానికి వెళ్తూ ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతదేహానికి మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సెల్ఫీ వీడియో తీసి ఆత్మహత్యాయత్నం



రేవల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శివ

గోపాల్‌పేట: సెల్ఫీవీడియో తీసి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన వనపర్తి జిల్లా రేవల్లి మండల కేంద్రంలో మంగళవారం కలకలం రేపింది. స్థానికుల వివరాల ప్రకారం.. రేవల్లి మండల కేంద్రానికి చెందిన వెంకటయ్య, బాలకిష్టమ్మల కుమారుడు శివకు లింగాల మండలం రాయవరం గ్రామానికి చెందిన శారదతో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి పాప, బాబు ఉన్నారు. మంగళవారం శివ మూడు నిమిషాల సెల్ఫీ వీడియో తీశాడు. అందులో తాను మరణిస్తున్నానని తన చావుకు కేవలం తన భార్యే కారణమని, తాను మరణిస్తే భార్యపైనే చర్యలు తీసుకోవాలని వీడియోలో చెప్పాడు. గొడవలు జరిగి పెద్దలను ఆశ్రయిస్తే వారు పట్టించుకోలేదని, రేవల్లి పోలీసులు సైతం తనని పట్టించుకోలేదని సెల్ఫీ వీడియోలో చెప్పాడు. వీడియో రేవల్లి గ్రామ వాట్సాప్ గ్రూపులో ప్రత్యక్షమయ్యేసరికి కొందరు యువకులు అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో శివ కుటుంబ సభ్యులు, పోలీసులు వారి ఇంటికెళ్లి చూడగా అప్పటికే పురుగుల మందు తాగి ఉన్నాడు. వెంటనే అతన్ని రేవల్లి సీహెచ్‌సీకి తరలించారు. తరచుగా తన కుమారుడిని కోడలు వేధించేదని, వారు వనపర్తి, నాగర్‌కర్నూల్, పెద్దకొత్తపల్లిలో జీవనం గడిపారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆ తర్వాత శివను వదిలేసి హైదరాబాద్ వెళ్లిందని, ఆ తర్వాత ఆమె రాకపోవడంతో శివ ఆవేదనకు గురైనట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై రేవల్లి ఎస్‌ఐ శివకుమార్‌ను వివరణ కోరగా, తన దృష్టికి రాలేదని, రెండు రోజుల్లో అతని ఆరోగ్యం కుదుట పడ్డాక బాధితులతో వివరాలు తెలుసుకుంటానని చెప్పారు. ప్రస్తుతం శివ ఆరోగ్యం బాగానే ఉందని తెలిపారు.

అదృశ్యమైన విద్యార్థి మృతి



సురేష్ (ఫైల్)

మద్దూరు: అదృశ్యమైన విద్యార్థి ఉరేసుకొని మృతిచెందిన ఘటన మండలంలోని పల్లెర్లలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సురేష్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన సురేష్(16) మద్దూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 7న మద్దూరుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు 8న బంధువులు, స్నేహితుల వద్ద వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో తల్లి పకీరమ్మ స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు నమోదు చేశారు. మంగళవారం సాయంత్రం గ్రామశివారులో సురేష్ ఓ చెట్టుకు ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించడంతో సమీప పొలాల రైతులు గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపారు. విద్యార్థి మృతిపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

విధులకు ఆటంకం కలిగించిన నిందితుడికి రిమాండ్

జడ్చర్ల: పోలీసుల విధులకు ఆటంకం కలిగించి, పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. ఇందిరానగర్‌కు చెందిన యాలాల భాస్కర్ గత నెలలో జడ్చర్ల కొత్త బస్టాండ్ సమీపంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడంతో పాటు పోలీసుల విధులను అడ్డుకున్నాడు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. 2022 ఏడాది నవంబర్‌లో సైతం ప్రధాన రహదారులపై వేగ నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన స్టాపర్స్‌ను ఎత్తుకెళ్లి ఇంటి వద్ద పెట్టుకోవడంతో పోలీసులు గుర్తించి అప్పట్లో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. జైలు నుంచి తిరిగి వచ్చిన నిందితుడు మళ్లీ పోలీసుల విధులకు అడ్డు తగలడంతో చర్యలు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బల్క్ ఫిర్యాదులు చంద్రబాబు కుట్రే

సీఈసీకి విజయసాయిరెడ్డి ఫిర్యాదు



సాక్షి, అమరావతి: విపక్ష నేత చంద్రబాబునాయుడి జీవితమంతా మోసం, కుట్ర, కుతంత్రాలతో నిండి పోయిందని వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వేణుంబాక విజయసాయిరెడ్డి దుయ్యబట్టారు. లక్షల ఓట్లను తొలగించాలంటూ కోనేరు సురేష్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు బల్క్ ఫిర్యాదు చేయించారని ఆరోపించారు. కోనేరు సురేష్ ఇచ్చిన అబద్ధపు బల్క్ ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని తాము డిమాండ్ చేశామన్నారు. టీడీపీ ఉద్దేశపూర్వకంగానే వైఎస్సార్‌సీపీ ఓట్లను టార్గెట్ చేసిందన్నారు. మరోవైపు దొంగ ఓట్ల చేర్పునకూ టీడీపీ పాల్పడుతోందన్నారు. 'మై పార్టీ డ్యాష్‌బోర్డ్ డాట్‌కామ్' పేరుతో చంద్రబాబు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతున్నారని ఆరోపించారు. అక్రమంగా అర్హుల ఓట్లు తొలగించేందుకు, దొంగ ఓట్ల చేర్పుకు చంద్రబాబు భారీ కుట్ర చేశారని చెప్పారు. ఓటరు కులం, రాజకీయ ప్రాధాన్యత అడిగే హక్కు బాబుకెవరిచ్చారు? అని నిలదీశారు. 'వన్ సిటిజన్.. వన్ ఓట్' అనేది తమ పార్టీ సిద్ధాంతం అని తెలిపారు. ఓటర్ ప్రొఫైల్ సర్వే పేరిట అభ్యంతరకర ప్రశ్నలపై సీఈసీకి ఫిర్యాదు చేశాం అని చెప్పారు. 6అంశాలపై సీఈసీని కలిశామన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ సభ్యులను కలిసిన అనంతరం మంగళవారం విజయవాడలో ఆయన ఎంపీ మార్గాని భరత్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు.

'కోర్టు ద్వారా లోకేశ్‌కు నోటీసులు ఇవ్వండి'


సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో కుంభకోణాలపై నమోదైన కేసుల దర్యాప్తును ప్రభావితం చేసేలా, కీలక సాక్షులను బెదిరించేలా వ్యాఖ్యలు చేసిన కేసులో నారా లోకేశ్‌కు నోటీసులు అందించాలని విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానం మంగళవారం కోర్టు అధికారులను ఆదేశించింది. నోటీసులు తీసుకునేందుకు నిరాకరించిన లోకేశ్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. రెడ్ డైరీ పేరుతో కీలక సాక్షులను బెదిరిస్తున్న లోకేశ్‌ను అరెస్ట్ చేసేందుకు అనుమతించాలన్న సీఐడీ పిటిషన్ విచారణ సందర్భంగా కీలక ఆదేశాలు జారీ చేసింది. గతంలో 41ఏ నోటీస్ కింద సీఐడీ విచారణకు హాజరైన సందర్భంగా విధించిన ఆంక్షలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించడం, ఈ కేసుల్లో కీలక సాక్షులుగా ఉన్న అధికారులు, న్యాయస్థానంలో వాంగ్మూలాలు ఇచ్చిన అధికారుల పేర్లను రెడ్‌బుక్‌లో రాశానని.. వారి సంగతి తేలుస్తానని లోకేశ్ పలు మీడియా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూలలో బెదిరించడం కలకలం రేపింది.

బ్రో.. ఇది దొంగ ఓటు!


జనసేన కార్యాలయం చిరునామాతో పవన్ కల్యాణ్ ఓటు నమోదు

గత ఎన్నికల సమయంలో విజయవాడ తూర్పు పరిధిలో ఓటు

- ఆరు నెలల క్రితం చిరునామా మార్పు
- ఓటు నమోదులో పార్టీ కార్యాలయం చిరునామా చెల్లుబాటుపై అనేక రకాల అనుమానాలు



దోర్ నంబర్ 11-1903ను అడ్రస్‌గా చూపించి జనసేన నేత పవన్‌కళ్యాణ్ నమోదు చేసుకున్న ఓటు



దోర్ నంబర్ 11-1903 మీద ఉన్న మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయం చిరునామా

సాక్షి, అమరావతి: ఓటు దొంగలే.. దొంగా దొంగా అని అరుస్తున్నారు. మంగళవారం రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు 'రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో దొంగ ఓట్లు నమోదవుతున్నాయి' అని స్వయంగా ఫిర్యాదు చేసిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్.. రాష్ట్రంలో నమోదు చేసుకున్న ఓటుపై 'అదీ దొంగ ఓటే' అన్న చర్చ ఉంది. జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయాన్నే తన నివాసంగా పేర్కొంటూ ఆయన ఓటు పొందారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఆయన ఓటు ఏజీజెడ్ 3083045 గుర్తింపు కార్డు నంబరుతో గుంటూరు జిల్లా మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 197వ నంబరు పోలింగ్ బూత్ పరిధిలో ఉంది. ఓటర్ లిస్టులో ఆ ఓటు ఇంటి నంబరు 11–1903గా పేర్కొన్నారు. అయితే మంగళగిరి పట్టణ పరిధిలో ఆ ఇంటి అడ్రసు గురించి ఆరా తీస్తే అది జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయం అడ్రసేనని స్పష్టమైంది. కొత్తగా ఒక ఇంటి చిరునామాతో ఓటు నమోదు చేసుకోవడానికి కొన్ని నియమ నిబంధనలు స్పష్టంగా ఉన్నాయని, ఈ లెక్కన ఒక పార్టీ కార్యాలయం అడ్రసుతో ఓటు నమోదు దొంగ ఓటు కిందకే వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారుల అవగాహన కోసం కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా రూపొందించి, జారీ చేసిన వివిధ రకాల నిబంధనావళిలో ఒకటైన.. 'మ్యానువల్ ఆన్ ఎలక్ట్రోల్ రోల్స్' ప్రకారం కొత్తగా వేరొక అడ్రసుతో ఓటరు నమోదుకు ఇంటి అడ్రసును 'ఆర్డనరీ రెసిడెన్స్' పేరుతో ప్రత్యేకంగా విశదీకరించారు. ఈ అంశంపై గౌహతి హైకోర్టు వెలువరించిన ఒక తీర్పు ప్రకారం ఇంటి అడ్రసు అంటే.. శాశ్వతంగా నివాసం ఉండేది అని కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల పుస్తకంలో స్పష్టంగా పేర్కొంది. టెంపరరీ (తాత్కాలిక) లేదా క్యాజువల్ నివాసంగా అది ఉండకూడదని ఆ నిబంధనలో స్పష్టంగా ఉంది. 'రెగ్యులర్‌గా రాత్రివేళ నిద్రించే ప్రాంతాన్నే' ఆ వ్యక్తి ఆర్డనరీ రెసిడెన్స్‌గా గుర్తించాలని స్పష్టం చేసింది. కానీ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అప్పుడప్పుడు హైదరాబాద్ నుంచి రాష్ట్రానికి వచ్చినప్పుడు ప్రైవేట్ హోటల్‌లో బస చేస్తుంటారు. పార్టీ విధుల్లో భాగంగా హైదరాబాద్ నుంచి మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయానికి వచ్చి వెళ్తుంటారు. అలాంటప్పుడు పార్టీ కార్యాలయం ఆయన శాశ్వత నివాసం ఎలా అవుతుందన్న విమర్శలున్నాయి. ఈ లెక్కన మంగళగిరి పార్టీ కార్యాలయం అడ్రసుతో ఆయన ఆరు నెలల ముందు నమోదు చేసుకున్న ఓటు.. దొంగ ఓటు కిందకే వస్తుందని అధికారుల స్థాయిలో చర్చ సాగుతోంది.

ఆ చిరునామాలో పవన్ ఓటు మాత్రమే..

2019 ఎన్నికల్లో రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేసిన పవన్ కల్యాణ్.. తన ఎన్నికల అఫడవిట్‌లో తన కుటుంబ సభ్యుల వివరాలలో భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయం అడ్రసు 11–1903తో ఇప్పుడు పవన్ తన ఒక్కరి ఓటు మాత్రమే నమోదు చేసుకోవడం విశేషం. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2019 ఎన్నికల సమయంలో విజయవాడ తూర్పు నియోజకవర్గ పరిధిలోని 91వ పోలింగ్ బూత్‌లో పవన్ తన ఓటు నమోదు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆరు నెలల క్రితం మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయ అడ్రసుకు ఓటును మార్చుకున్నారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

తమ్ముడి బాటలోనే అన్న నాగబాబు

రాష్ట్రంలో పవన్‌కల్యాణ్ నమోదు చేసుకున్న ఓటు దొంగ ఓటు.. అని అని చర్చ సాగుతున్న తరుణంలో.. అతని సోదరుడు నాగబాబు కూడా దొడ్డిదారిన రాష్ట్రంలో దొంగ ఓట్ల నమోదుకు పూనుకున్నారు. హైదరాబాద్‌లో నివాసం ఉండే నాగబాబు మొన్నటి తెలంగాణ ఎన్నికల పోలింగ్ ముగిసిన మరుసటి రోజు అంటే 2023 డిసెంబరు 4 తేదీన మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని తాడేపల్లి పట్టణ పరిధిలో వడ్డేశ్వరం – రాధా రంగ నగర్‌లోని 5–263 ఇంటి అడ్రసు పేరుతో ఆన్‌లైన్‌లో ఓటుకు దరఖాస్తు చేశారు. నాగబాబు, ఆయన భార్య, కూతురు నిహారిక, కుమారుడు వరుణ్‌తేజ్ (సినీ నటుడు), కోడలు లావణ్య త్రిపాఠి (సినీ నటి) కలిపి మొత్తం ఆరుగురు ఆ ఇంటి అడ్రసులో నివాసం ఉంటున్నట్లు పేర్కొంటూ ఓట్లు నమోదు ఫారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అయితే ప్రాథమిక స్థాయిలో బూత్ లెవల్ అధికారి (బీఎల్‌వో) పరిశీలనలో నాగబాబు గానీ, వారి కుటుంబం గానీ ఆ అడ్రసులో నివాసం ఉండడం లేదని తేలింది. ఈ ఇల్లు జనసేన పార్టీ అభిమానిదని స్థానికులు పేర్కొన్నారు. ఆ తర్వాత కూడ మంగళగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఓటు నమోదు ప్రక్రియలో భాగంగా నాగబాబు, ఆయన కుటుంబ సభ్యులు తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలంటూ ఆ ఇంటి తలుపులకు నోటీసులు అంటించి వెళ్లారు. అయితే నాగబాబు, ఆయన కుటుంబ సభ్యులందరి తరుపున సంబంధిత అడ్రసులో పేర్కొన్న ఇంటి యజమానే అధికారుల ముందు హాజరైనట్టు అధికార వర్గాలు తెలిపాయి.

ఇక్కడ నివాసం.. అక్కడ వ్యాపారమట!

అధికారుల విచారణ సమయంలో నాగబాబు తాను తాడేపల్లిలో నివాసం ఉంటున్నానని, అయితే ప్రస్తుతం వ్యాపార నిమిత్తం హైదరాబాద్‌లో ఉన్నందున స్వయంగా విచారణకు రాలేకపోయినట్టు తాను సంతకం చేసిన ఒక పేపరు ఆ ఇంటి యజమాని ద్వారా పంపారు. మరో ఇద్దరు ఇలాగే పేపర్‌పై రాసి.. దానిని ఫొటో తీసి ఆ ఇంటి యజమాని ద్వారా పంపారు. మిగిలిన మరో ముగ్గురి నుంచి ఎలాంటి అఫిడవిట్ లేదని తెలిసింది. మొత్తంగా ఆ అడ్రసులో పేర్కొన్న ఇంటి యజమానే నాగబాబు కుటుంబ సభ్యులు ఆరుగురి తరఫున విచారణకు హాజరయ్యారు. ఆ ఇంటి అడ్రసులో నాగబాబు కుటుంబం నివాసం ఉండడం లేదని అధికారులు నిర్ధారించుకుని, ఆ ఆరుగురి ఓట్లను తిరస్కరించారు. సినీ నటుడిగా, పార్టీ అధ్యక్షుడి హోదా లేదా కీలక బాధ్యతల్లో ఉన్న పవన్‌కల్యాణ్, నాగబాబు లాంటి వారే తమ సొంత ఓట్ల నమోదు ప్రక్రియలో ఇలా అడ్డదారులు తొక్కడం అధికార వర్గాల్లో చర్చనీయాంశమైంది.

లక్ష పుస్తకాలు చదివానన్న స్వయం ప్రకటిత మేధావి ఆయన.. విలువల గురించి, అనుబంధాల గురించి ఊగిపోతూ ప్రసంగించడం ఆయనకు అలవాటు.. అందరూ తనలాగే ఆలోచించాలని, తన మార్గంలోనే నడవాలని ప్రవచన పలుకులు పలకడం కూడా ఆయనకే సొంతం. 'చంద్రబాబు చేత.. చంద్రబాబు కొరకు.. చంద్రబాబు యొక్క..' అంటూ అందరూ ఆ బాబు బాగు కోసమే పరితపించాలని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేసిన నేత. ఎన్నెన్నో నీతులు చెప్పే ఈ నేత నిబంధనలకు విరుద్ధంగా పార్టీ కార్యాలయం చిరునామాతో ఓటు పొందడం ఇప్పుడు చర్చనీయాంశం. దయ్యాలు వేదాలు వల్లించడం అంటే ఇదేమరి.

పిటిషనర్‌కు పిటిషన్ వేసే అర్హత లేదు

- తెలంగాణ హైకోర్టులో 'వ్యూహం 'నిర్మాత–దర్శకుల వాదనలు
- కోర్టులు.. సమాంతర సెన్సార్ బోర్డులు కాదు: సీబీఎఫ్‌సీ
- తదుపరి వాదనల విచారణ నేటికి వాయిదా

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ దర్శకత్వం వహించిన వ్యూహం చిత్ర విడుదలకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) ఇచ్చిన సర్టిఫికెట్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లో..అసలు పిటిషన్ దాఖలు చేసే అర్హతే పిటిషనర్‌కు లేదని నిర్మాత, దర్శకులు వాదనలు వినిపించారు. పరువునష్టం వాటిల్లుతున్న చంద్రబాబు కుమారుడిగా అని పిటిషన్‌లో పేర్కొన్నారని.. అంటే అది ఆయన వ్యక్తిగత వ్యవహారమని, రిట్ పిటిషన్ మెయింటెనబుల్ కాదని పేర్కొన్నారు. అనంతరం వాదనలను తెలంగాణ హైకోర్టు బుధవారానికి వాయిదా వేసింది. దీనిపై జస్టిస్ సూరేపల్లి నందా మంగళవారం మరోసారి విచారణ చేపట్టారు. 10.30 విచారణ సందర్భంగా..సర్టిఫికెట్ జారీకి సంబంధించి ఓ కమిటీ ఏర్పాటు చేస్తామని, అందులో ఎవరు ఉండాలనేది వాది, ప్రతివాదులు నిర్ణయం తీసుకొని 12 గంటలకు రావాలని సూచించారు. అయితే కమిటీ నిర్ణయంపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో వాదనలు ప్రారంభించారు. పార్టీ జెండాలు, నేతల పేర్లతో చిత్రం తీశారని, ఇది పలు పార్టీల నేతల పరువుకు నష్టం కలిగించేదిగా ఉందని పిటిషనర్ తరఫున న్యాయవాది మురళీధర్‌రావు వాదించారు.

'సీబీఎఫ్‌సీ'లో కోర్టులు జోక్యం చేసుకోలేవు..

అనంతరం సీబీఎఫ్‌సీ తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్(ఏఎస్‌జీ) నరసింహశర్మ వాదనలు వినిపిస్తూ.. 'సినిమాటోగ్రాఫ్ చట్టం, ఫిల్మ్ సర్టిఫికేషన్ మార్గదర్శకాలు, ఆర్టికల్ 19(1)(ఏ) ప్రకారం భావ ప్రకటన హక్కును పరిగణనలోకి తీసుకుని రివైజింగ్ కమిటీ ఏకగ్రీవంగా 'యు' సర్టిఫికెట్ మంజూరు చేసింది. చట్టప్రకారం ఆ నివేదికను రహస్యంగా ఉంచాల్సిన అవసరం ఉంది. సీబీఎఫ్‌సీ ఒకసారి సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాత కోర్టులు జోక్యం చేసుకోవడానికి వీలులేదు. ఇదే జరిగితే ప్రతి సినిమాకు ఏదో కారణం చూపించి ఇక అంతా కోర్టులను ఆశ్రయిస్తారు. ఇది చిత్రాల విడుదలకు ఆటంకంగా మారుతుంది. కోర్టులు సమాంతరంగా సెన్సార్ బోర్డు పాత్ర పోషించలేవు. రివిజన్ కమిటీ చట్టప్రకారమే సర్టిఫికెట్ జారీ చేసింది. ఇది సహజ న్యాయ సూత్రాల ఉల్లంఘన ఎక్కడా జరగలేదు' అని వాదించారు.

పిటిషనర్‌కు అర్హత లేదు...

నిర్మాత–దర్శకుడి తరఫున సీనియర్ న్యాయవాది వెంకటేశ్ వాదనలు వినిపిస్తూ.. 'తండ్రికి పరువు నష్టం జరిగినప్పుడు కుమారుడు కోర్టుకు రావడం చట్టప్రకారం చెల్లదు. టీజర్‌కు సంబంధించిన వీడియో చూశామని పిటిషన్‌లో పేర్కొన్నారు.. దాన్ని సినిమా మొత్తానికి ఎలా ఆపాదిస్తారు. చిత్రం చూశాక అవమానం జరిగిందని భావిస్తే అప్పుడు పరువునష్టం దావా వేసుకోవచ్చు. ఇదే కోర్టు చిత్రానికి సర్టిఫికెట్ జారీ కోసం రివిజన్ కమిటీ వేయాలని సీబీఎఫ్‌సీని ఆదేశించింది. తొమ్మిది మందితో ఏర్పాటైన రివిజన్ కమిటీ అన్ని అంశాలను పరిశీలించి ఏకగ్రీవంగా సర్టిఫికెట్ జారీ చేసింది. ఇప్పుడు మళ్లీ ఇదే కోర్టు సర్టిఫికెట్ ఇవ్వడాన్ని తప్పుబట్టడం సరికాదు. గతంలో సైరా నరసింహారెడ్డి చిత్రంపై కొందరు ఇదే హైకోర్టును ఆశ్రయించగా, చిత్రం చూడకుండానే ఆరోపణలు చేయడం సరికాదంటూ పిటిషన్‌ను ద్విసభ్య ధర్మాసనం కొట్టివేసింది. చిత్రం చూడకుండానే పరువుకు నష్టం వాటిల్లుతుందని.. ఊహించి పిటిషన్ వేయడం ఆక్షేపణీయం. చట్టపరమైన చర్యలకు ఊహలు ప్రాతిపదిక కాదు. సీబీఎఫ్‌సీ ఇచ్చిన నివేదికను కోర్టు రహస్యంగానే ఉంచాలి. వివరాలు బహిర్గతమైతే మీడియా, సోషల్ మీడియాకు చేరే అవకాశం ఉంటుంది' అని పేర్కొన్నారు. న్యాయమూర్తి.. విచారణ బుధవారానికి వాయిదా వేశారు.

ప్రతి హైకోర్టులో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి హెచ్‌సీఏఏ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: ప్రతి హైకోర్టులో సుప్రీంకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీని హైకోర్టు అడ్వొకేట్ అసోసియేషన్ (హెచ్‌సీఏఏ) విజ్ఞప్తి చేసింది. హైకోర్టుల్లో వసతుల కల్పన తదితర వివరాల సేకరణ, చర్చ కోసం సుశీల్‌కుమార్ మోదీ ఆధ్వర్యంలోని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ మంగళవారం హెచ్‌సీఏఏలో న్యాయవాదులతో భేటీ అయ్యింది. అన్ని న్యాయస్థానాల్లో ఆన్‌లైన్ సేవలు అందించేలా ఏర్పాటు చేయాలని అసోసియేషన్ కోరింది. ఇది జూనియర్లకు వినియోగపడుతుందని పేర్కొంది. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఏఏ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు కల్యాణ్‌రావు, కార్యదర్శులు దేవేందర్, ప్రదీప్, నాగులూరి కృష్ణకుమార్‌గౌడ్, బైరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు తరలింపును ఆపాలి..

హైకోర్టు తరలింపును ఆపాలంటూ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ముందు పలువురు న్యాయవాదులు ఆందోళన చేశారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ భేటీని అడ్డుకున్నారు. హైకోర్టు తరలింపును ఆపాలని, తమ సమస్యలు వినాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. అసోసియేషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో కమిటీ భేటీ అర్థాంతరంగా ముగిసింది. అనంతరం కమిటీ.. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, ఇతర న్యాయమూర్తులతో సమావేశమయ్యింది.

డిగ్రీ ఫలితాలు విడుదల



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల సెమిస్టర్ 1, 3, 5లకు సంబంధించిన ఫలితాలు మంగళవారం పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ విడుదల చేశారు. ఈ మేరకు సెమిస్టర్–1లో 987 మందికి 338 మంది ఉత్తీర్ణులు కాగా.. మూడో సెమిస్టర్‌లో 358 మందికి 445 మంది, ఐదో సెమిస్టర్‌లో 927 మందికి 594 మంది విద్యార్థులు పాసయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి పేర్కొన్నారు. కార్యక్రమంలో కంట్రోలర్ రాములు, మల్లికార్జున్, సూర్యనారాయణ, సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రామన్‌పాడుకు నీరు నిలిపివేత

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో మంగళవారం 1,020 అడుగుల మేర నీరు ఉంది. జూరాల ఎడమ, సమాంతర కాల్వ ద్వారా నీటిని నిలిపివేసారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

అభివృద్ధి పనులు ఆపొద్దు



అన్నాసాగర్‌లోని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సోదరుడి భార్యను పరామర్శిస్తున్న కవిత

- కౌన్సిలర్లను కొనాల్సిన అవసరం లేదు.. కావాలంటే మేమే పంపిస్తాం
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: 'తెలంగాణ రాక ముందు పాలమూరు పరిస్థితి.. వచ్చాక ఎలాంటి అభివృద్ధి జరిగిందో కళ్లముందే కనిపిస్తుంది.. ఈ ఐదేళ్లు చేసినా ఒడవని పనులు మంజూరు చేశాం.. వాటిని పూర్తి చేస్తే ప్రజలకు మేలు జరుగుతుంది.. మీకు మా నుంచి ఎలాంటి సహకారం కావాలన్నా ఇస్తాం.. మాపై కోపంతో అభివృద్ధి పనులు ఆపితే ప్రజలు నష్టపోతారు.. మా కౌన్సిలర్లను కొనాల్సిన అవసరం లేదు.. కావాలంటే మేమే పంపిస్తాం' అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ రూరల్ మండల కార్యకర్తల సమావేశం అనంతరం ఎమ్మెల్సీ కవితతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ నర్సింహులుపై అవిశ్వాసం పెట్టేందుకు కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లను కొనే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. ప్రజలకు నష్టం జరగకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని, మీకు ఏ కౌన్సిలర్ కావాలో చెబితే తామే పంపిస్తామన్నారు. అధికారం కోసం తాము పాకులాడలేదన్నారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా మన్యంకొండ అభివృద్ధి కోసం రోప్‌వే ఏర్పాటు, హోటళ్ల మంజూరు, ఐటీహబ్, ఇండస్ట్రీయల్ కారిడార్‌లో పరిశ్రమలు, వెయ్యి పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రితోపాటు ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇంత అభివృద్ధి చేసినా గత ఎన్నికల్లో పాలమూరు ప్రజలు ఏం మాయలో పడ్డారో అర్థం కాలేదన్నారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ తనకు నిజామాబాద్ ఎంతో పాలమూరు కూడా అంతే అన్నారు. తెలంగాణ కోసం గళం వినిపించిన పార్టీ బీఆర్‌ఎస్.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీకి అండగా ఉండాలని కోరారు. ఇంటి బిల్లు 200 యూనిట్ల కన్నా తక్కువ వస్తే బిల్లు కట్టవద్దని జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, నాయకులు రాజేశ్వర్‌గౌడ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆలకు పరామర్శ

భూత్పూర్: దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని కవిత పరామర్శించారు. అన్నాసాగర్‌లోని స్వగృహంలో ఇటీవల ఆల సోదరుడు శశివర్ధన్‌రెడ్డి గుండెపోటుతో మృతి చెందారు. దీంతో మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను ఆమె ఓదార్చారు. ఆమె వెంట ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తదితరులున్నారు.

జోగుళాంబ ఆలయ అభివృద్ధికి కృషి



కేంద్రమంత్రి సత్యపాల్ సింగ్ బఘేల్‌కు జోగుళాంబ అమ్మవారి జ్ఞాపికను అందిస్తున్న ఈఓ, చైర్మన్



బీచుపల్లి ఆలయాన్ని దర్శించుకున్న కేంద్రమంత్రి సత్యపాల్ సింగ్ బఘేల్

- కేంద్ర మంత్రి సత్యపాల్ సింగ్ బఘేల్

జోగుళాంబ శక్తిపీఠం: రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠమైన జోగుళాంబ ఆలయ అభివృద్ధి కోసం కృషిచేస్తానని కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ సహాయమంత్రి సత్యపాల్‌సింగ్ బఘేల్ అన్నారు. మంగళవారం ఆయన అయిదో శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గద్వాల అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్, ఆలయ ఈఓ పురేందర్, చైర్మన్ చిన్నకృష్ణయ్య, ప్రధాన అర్చకులు ఆనంద్‌శర్మ వారికి ఆలయ మర్యాదలతో పూర్ణకుంబ స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి సంబంధించి డిటైల్ ప్రాజెక్టు రిపోర్ట్ ఇస్తే పూర్తిస్థాయిలో కేంద్ర సహకారం అందిస్తామని చెప్పారు. అనంతరం అక్కడికి వచ్చిన ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. వేతన సమస్యల విషయాన్ని పరిష్కరించేందుకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, అధికార ప్రతినిధి రాజోపాల్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయ కార్యదర్శి రాజశేఖర్‌శర్మ, ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ మంజుల, సీఐ రాజు, ఆర్ఐ వాణి, ఆలయ ధర్మకర్తలు వెంకటేశ్వర్ రెడ్డి, వెంకటనారాయణరెడ్డి తదితరులున్నారు.

బీచుపల్లిని సందర్శించిన కేంద్ర మంత్రి

ఎర్రవల్లి చౌరస్తా: ఎర్రవల్లి మండల పరిధిలోని బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయాన్ని కేంద్రమంత్రి సత్యపాల్ సింగ్ బఘేల్ సందర్శించారు.ఆలయ సిబ్బంది పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు మారుతీచారి తీర్థ ప్రసాదాలను అందజేసి ఆలయ విశిష్టతను వివరించారు.

టోర్నీలో క్రీడా స్ఫూర్తి చాటాలి

- జిల్లా విద్యుత్ ఎస్ఈ ఎన్.శ్రీరాం మూర్తి
- ఉత్సాహంగా రాష్ట్రస్థాయి విద్యుత్ ఉద్యోగుల వాలీబాల్ చాంపియన్‌షిప్



మహబూబ్‌నగర్ (ఆపరేషన్-కరీంనగర్ (ఓఎంసీ) జట్ల మధ్య మ్యాచ్

మహబూబ్‌నగర్ క్రీడలు: వాలీబాల్ టోర్నీలో క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటాలని జిల్లా విద్యుత్ ఎస్ఈ ఎన్.శ్రీరాంమూర్తి అన్నారు. జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో రాష్ట్రస్థాయి విద్యుత్ ఉద్యోగుల(తెలంగాణ ట్రాన్స్‌కో, డిస్కం) ఇంటర్ సర్కిల్ వాలీబాల్ పోటీలు మంగళవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ముందుగా ఎస్ఈ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీని పురస్కరించుకొని క్రీడాజెండాను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఈ జిల్లా విద్యుత్ ఎస్ఈ ఎన్.శ్రీరాంమూర్తి, జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. క్రీడలతో సోదరభావం పెరుగుతుందన్నారు. విధుల్లో బిజీగా ఉండే విద్యుత్ ఉద్యోగులకు ఇలాంటి క్రీడా పోటీలు ఉల్లాసాన్ని ఇస్తాయని తెలిపారు. టోర్నీలో ఉద్యోగులు ప్రతిభ చాటాలన్నారు. డీవైఎస్ఓ శ్రీనివాస్ మాట్లాడారు. ఉద్యోగులు క్రీడా పోటీల్లో పాల్గొనడం అభినందనీయమని అన్నారు. ఓడిన జట్లు నిరాశ చెందకుండా మళ్లీ గెలుపు కోసం శ్రమించాలని కోరారు. కార్యక్రమంలో డీఈలు చంద్రమౌళి, సి.వెంకటశివరాం, విద్యుత్ సంస్థల క్రీడల అధికారి జగన్నాథ్, గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ హబీబుద్దీన్ షకీల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ టోర్నీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న అధికారులు

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీ..

రాష్ట్రస్థాయి విద్యుత్ ఉద్యోగుల వాలీబాల్ టోర్నీలో 13 జట్లు పాల్గొన్నాయి. మహబూబ్‌నగర్ ఆపరేషన్, మహబూబ్‌నగర్ ఓఎంసీ, ఖమ్మం ఆపరేషన్, ఖమ్మం ఓఎంసీ, కరీంనగర్ ఆపరేషన్, కరీంనగర్ ఓఎంసీ, నల్గొండ ఆపరేషన్, ఆదిలాబాద్ ఆపరేషన్, హైదరాబాద్ సౌత్, హైదరాబాద్ సెంట్రల్, హబ్సిగూడ ఆపరేషన్ జట్లు రాష్ట్రస్థాయి పోటీల్లో తలపడుతున్నాయి. ఆయా జట్లకు లీగ్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. తొలి రోజు మ్యాచుల్లో మహబూబ్‌నగర్ ఆపరేషన్ జట్టు 15–3, 15–8 సెట్ల తేడాతో కరీంనగర్ ఓఎంసీ జట్టుపై గెలుపొందింది. ఖమ్మం జట్టు 15–8, 15–10 సెట్ల తేడాతో నిజామాబాద్ జట్టుపై, హైదరాబాద్ సౌత్ జట్టు 15–10, 10–15, 15–13 తేడాతో మహబూబ్‌నగర్ జట్టుపై విజయం సాధించాయి.

మైసమ్మ బైలెల్లినాదో..



మైసమ్మ దేవాలయంలో భక్తులు

- భక్తిశ్రద్ధలతో 111 బోనాలు

నవాబుపేట: అమ్మా బైలెల్లినాది.. తల్లి మైసమ్మ బైలెల్లినాది అంటూ అమ్మవారి బోనాలు ఘనంగా కొనసాగాయి. మంగళవారం మండల పరిధిలోని పర్వతాపూర్ మైసమ్మ దేవతా ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో 111 బోనాలతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. దీంతో అడవి మొత్తం అమ్మవారి నామస్మరణతో మారుమోగింది. పచ్చని అడవి భక్తులతో కిటకిటలాడింది. మైసమ్మ దేవాలయ ఉత్సవాల్లో అత్యంత ప్రధానమైన రోజు ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణయ్య, దేవాలయ అధికారి మధనేశ్వర్‌రెడ్డి ప్రత్యేక బోనాల కార్యక్రమం నిర్వహించారు. అలంకరించిన బోనాల దేవాలయం చుట్టూ ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం శకటోత్సవం నిర్వహించారు. కాగా కార్యక్రమంలో మేక పొటేళ్ల బండి ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమాల్లో జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీంధర్‌రెడ్డి, సర్పంచ్ జంగమ్మ, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మధుసూదన్‌రెడ్డి, చెన్నయ్య, మాధవులు, నరేందర్, బాలయ్య, రాజు, వెంకట్‌రెడ్డి, ఖాజా, గోపాల్‌గౌడ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.





పర్వతాపూర్ మైసమ్మ దేవత



అమ్మవారి ఉత్సవాల్లో బోనాలతో భక్తులు